# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 18-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- “స్వామిత్వ” పథకం లక్షలాది మంది గ్రామీణ ప్రజలకు ప్రయోజనాన్ని చేకూర్చుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాల హత్యాచార ఘటనలో నిందితుడు సంజయ్ రాయ్‌ను సీబీఐ కోర్టు దోషిగా నిర్ధారించింది.
- ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు భారత్ ఎల్లప్పుడూ కృషి చేస్తోందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు.
- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు మొత్తం 1,521 మంది నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల సంఘం వెల్లడించింది.
- ఇజ్రాయెల్ హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం రేపటి నుంచి అమలులోకి రానుంది.

========================

గ్రామీణ ప్రజలకు సాధికారికత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన “స్వామిత్వ పథకం” లక్షలాది మందికి ప్రయోజనాన్ని చేకూర్చుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. స్వామిత్వ పథకం లబ్ధిదారులకు ప్రధానమంత్రి ఈరోజు దృశ్య మాధ్యమ విధానంలో ఆస్తి కార్డులను పంపిణీ చేశారు. ఈ పథకం కింద దేశంలోని 10 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లోని 230 జిల్లాల్లోని లబ్ధిదారులు కార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... ఈ రోజు చారిత్రాత్మకమైన రోజని, సుమారు 65 లక్షల మందికి పైగా ప్రజలకు ఆస్తి కార్డులు అందించామని, దీంతో గ్రామాల్లోని 2.25 కోట్ల మంది తమ ఇంటికి సంబంధించిన శాశ్వత ఆస్తి కార్డులను పొందారని పేర్కొన్నారు. స్వామిత్వ పథకం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధికి మూల స్థంభంగా మారుస్తుందని నరేంద్రమోదీ పేర్కొంటూ....

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాలలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం కేసుకు సంబంధించి సీల్దాలోని సీబీఐ కోర్టు ఈరోజు తీర్పు వెలువరించింది. సివిల్ వాలంటీర్ అయిన నిందితుడు సంజయ్ రాయ్‌ను దోషిగా నిర్ధారించింది. శిక్షలను సోమవారం ఖరారు చేస్తామని వెల్లడించింది. కాగా, 2024 ఆగస్టు 9వ తేదీన ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రిలో రాత్రి విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై హత్యాచార సంఘటన జరిగింది. సివిల్ వాలంటీర్ సంజయ్ రాయ్‌ను ప్రధాన నిందితుడిగా పోలీసులు గుర్తించారు. ఆగస్ట్ 10న అతడిని అరెస్ట్ చేశారు. కోల్‌కతా హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు దర్యాప్తును సీబీఐ చేపట్టింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇజ్రాయెల్ హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం రేపటి నుంచి అమలులోకి రానుంది. ఈ తాత్కాలిక ఒప్పందం మొత్తం మూడు దశల్లో ఉండగా మొదటి దశ 43 రోజుల పాటు కొనసాగుతుంది. ఈ ఒప్పందంలో భాగంగా మొదటి దశలో ఇజ్రాయిల్ 735 మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేస్తుంది. బదులుగా 16 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల 25 మంది మైనర్లను మినహాయించి విడుదలకు సిద్ధంగా ఉన్న ఖైదీలందరి పేర్లను మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. రేపటి అమలుకు మార్గం సుగమం చేసే ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆమోదించిన కొద్దిసేపటికే మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదలైంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మొత్తం 70 శాసనసభ నియోజకవర్గాలకు గాను 1,521 మంది నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల సంఘం తెలిపింది. నామినేషన్ల చివరి రోజైనా నిన్న 680 నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయని పేర్కొంది. న్యూ ఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో నామినేషన్ పత్రాలు దాఖలైనట్లు వెల్లడించింది. ఈ స్థానానికి మొత్తం 29 మంది అభ్యర్థులు 40 నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఈ స్థానం నుండి పోటీ చేస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

వక్ఫ్ సవరణ చట్టంపై ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఈరోజు పాట్నాలో వక్ఫ్ బోర్డుల ప్రతినిధులతో సమావేశమయ్యింది. ఈ కమిటీ తన నివేదికను వచ్చే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో సమర్పిస్తుందని జేపీసీ ఛైర్మన్ జగదాంబికా పాల్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రయాగ్‌రాజ్ లో జరుగుతున్న అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. సాధారణ ప్రజలతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు త్రివేణి సంగమం వద్ద పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు మహాకుంభమేళాలో పాల్గొన్నారు. గంగ, యమున, సరస్వతి నదీ సంగమం వద్ద పుణ్యస్నానం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక అక్షయ దేవాలయం, పాతాళ్‌పురి, సరస్వతి కుండ్, హనుమాన్ దేవాలయాలను ఆయన సందర్శించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంటు 2025-26 బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31 నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగిస్తారు. ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్

ప్రవేశపెడతారు. ఈ సమావేశాలు తొలి విడత ఫిబ్రవరి 13 వరకు జరుగుతాయి. తర్వాత మార్చి 9వ వరకు సెలవు ఉంటుంది. శాఖల వారీగా జరిపిన బడ్జెట్ పద్దులపై పార్లమెంటు స్థాయీ సంఘాలు అధ్యయనం చేసి నివేదికలు సమర్పించడానికి ఆ సమయం కేటాయిస్తారు. తర్వాత మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత సమావేశాలు సాగుతాయి. తొలి విడత సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు భారత్ ఎల్లప్పుడూ కృషి చేస్తోందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. ఈరోజు ముంబైలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.., అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని అన్నారు. పాశ్చాత్య విధానానికి భారత్ వ్యతిరేకమైనప్పటికీ.. వ్యూహాత్మక ప్రయోజనాల కోసం మద్దతిస్తుందని పేర్కొన్నారు. ఆయుధీకరణ విషయంలో భారత్ స్వావలంబన పెంచుకోవాల్సిన అవసరముందన్నారు. భారత్‌ను 'విశ్వబంధు'గా అభివర్ణించిన జైశంకర్.. స్నేహాన్ని పెంచుకుంటూ, సమస్యలను తగ్గించుకుంటూ ప్రపంచ వేదికపై భారత్ ఓ నమ్మకమైన భాగస్వామిగా వ్యవహరిస్తోందని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 38 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటన నిమిత్తం కొద్ది సేపటి క్రితం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు ఎన్డీయే కూటమి నేతలు స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశమై పలు అంశాలపై చర్చిస్తారు. రేపు ఉదయం కృష్ణా జిల్లా, గన్నవరం సమీపంలో నిర్మించిన జాతీయ విపత్తు స్పందన దళం ఎన్డీఆర్ఎఫ్ పదవ బెటాలియన్ ను, అలాగే జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ -ఎన్ఐడీఎం కేంద్రాన్ని అమిత్ షా ప్రారంభిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 118వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

వడోదర వేదికగా ఈరోజు కర్నాటక, విదర్భా జట్ల మధ్య జరుగుతున్న విజయహజారే ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించేందుకు విదర్భ మరో 160 పరుగులు చేయాల్సి ఉంది. ముందుగా బ్యాటింగ్ చేసిన కర్నాటక జట్టు 349 పరుగులు లక్ష్యాన్ని నిర్దేశించింది. మరోవైపు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ-2025 కోసం బీసీసీఐ భారత జట్టును ఈరోజు ప్రకటించింది. భారత కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ జట్టు వివరాలను వెల్లడించారు. ఈ టోర్నమెంలో భారత వైస్ కెప్టెన్ గా శుభ్‌మన్ గిల్ వ్యవహరించనున్నారు. కాగా ఫిబ్రవరి 19 నుంచి పాకిస్తాన్ వేదికగా ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా భారత్ తటస్థ వేదికైన దుబాయ్‌లో మ్యాచ్‌లు ఆడనుంది. దుబాయ్ వేదికగా ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో జరగనున్న తొలి మ్యాచ్‌తో భారత్ ఈ టోర్నమెంట్ ను ఆరంభిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికా 47వ అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్  సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇందుకోసం ప్రమాణస్వీకార కమిటీ ఏర్పాట్లలను ముమ్మరం చేసింది.

========================
========================